ఖమ్మంలో జలప్రళయం

ఊళ్లకు ఊళ్లను ముంచెత్తిన వరద • ఉప్పొంగిన వాగులు, నదులు, ఏరులు

మున్నేరు, పరీవాహకాల మహోగ్రరూపం • ఆకేరు ఉధృతికి మునిగిన రాకాసితండ

ఆరుగురి గల్లంతు.. మూడు మృతదేహాల గుర్తింపు • సీతారామ కాలువలకు గండ్లు

ఖమ్మం నగరంలోని కాల్వొడ్డులో నీట మునిగిన లోతట్టు ప్రాంతం

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం/ తిరుమలాయపాలెం/ కూసుమంచి, సెప్టెంబర్ 1: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురిసిన భీకర వర్షం జలప్రళయాన్ని తలపించింది. శనివారం అర్ధరాత్రి నుంచి మొదలైన వరద రాత్రికి రాత్రే ఊళ్లను, కాలనీలను ముంచెత్తింది. జిల్లాలో గరిష్ఠంగా 32 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 51 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం నగర సమీపంలోని మున్నేరు మహోగ్రరూపం దాల్చింది. మున్నేరుపై ప్రకాశ్‌నగర్ వద్ద ఉన్న వంతెన పైనుంచి వరద ప్రవహించింది. ఈ వంతెనపై ఓ మహిళ సహా ఐదుగురు వ్యక్తులు చిక్కుకుపోయారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి దగ్గర సుమారు ఆరుగురు, వాల్యాతండా వద్ద 10 మంది, ఖమ్మం నగరంలోని డాబాల్లో సుమారు 50 మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు విశాఖపట్నం నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లను రప్పించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్యలు చేపట్టారు. వరద ఉధృతి కారణంగా ఖమ్మంలో కరుణగిరి వద్ద మున్నేరు వంతెన కంపించింది. ఖమ్మం నగరం సహా జిల్లాలో జలదిగ్బంధంలో చిక్కుకున్న చాలామందిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. మున్నేరు పరీవాహక ప్రాంతాలన్నింటినీ వరద ముంచెత్తింది. పలు కాలనీల్లో అనేక ఇండ్లు మునిగిపోయాయి. బాధితులు డాబాలపైకి ఎక్కి హాహాకారాలు చేశారు. కొన్నిచోట్ల వాహనాలు కూడా పూర్తిగా నీటమునిగాయి. గోళ్లపాడు కాలువలోకి వర్షపు నీరు చేరడంతో మురుగు పోటెత్తింది. అదంతా స్థానిక ఇళ్లోలోకి చేరింది. ఇంకొందరు కట్టుబట్టలతో ఇళ్లను వదిలి రోడ్ల పైకి వచ్చారు. ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండా పంచాయతీలోని అనేక కాలనీలు వరదనీటిలో చిక్కుకోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలను బైపాస్‌రోడ్డులోని రాంలీలా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు.

ఆకేరు ఉధృతికి మునిగిన రాకాసితండా

తిరుమలాయపాలెం మండలంలో మునుపెన్నడూ లేనివిధంగా భారీ వర్షం కురిసింది. మండలంలోని బీరోలు పెద్ద చెరువు, ఊర చెరువులకు గండిపడి పంటపొలాలు కొట్టుకుపోయాయి. బంధంపల్లి ఎస్సీ కాలనీ మునిగిపోయింది. కాకరవాయిలో రెండు కోళ్లఫారాలు మునిగి కోళ్లు చనిపోయాయి. ఆకేరు ఉధృతంగా ప్రవహించడంతో ఆదివారం తెల్లవారుజామున రాకాసితండా నీట మునగడంతో తండావాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గుట్టలు, డాబాలు ఎక్కి ఆర్తనాదాలు చేశారు. వారిని పడవల ద్వారా రక్షించి, 80 మందిని పునరావాస కేంద్రానికి తకలించారు.

'పాలేరు'కు వరద పోటు

పాలేరు రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో రాత్రికి రాత్రే ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 28 అడుగులకు పైగా నీరు వచ్చి చేరింది. సమీపంలోని ప్రజలు కట్టుబట్టలతో ఇండ్లు వదిలివెళ్లారు. నాయకన్‌గూడెంలో గుడి సమీపంలో ఇటుకలు తయారు చేస్తున్న కుటుంబం వరదలో చిక్కుకున్నది. వారిలో ఒకరిని ఎన్‌డీఆర్‌ఎస్ అధికారులు కాపాడారు. మరో ఇద్దరు కొట్టుకొని పోగా వారి ఆచూకీ లభ్యం కాలేదు. పెట్రోల్‌బంక్‌లో చిక్కుకున్న వ్యక్తిని మత్స్యకారులు, అధికారులు కాపాడారు. పరిస్థితి గురించి మంత్రి పొంగులేటి ఆరా తీశారు. నాయకన్‌గూడెం వద్ద పాలేరు వరద పోటెత్తి ఓ ఇంటిని చుట్టుముట్టడంతో యూఖూబ్, సైదాబీ దంపతులు, వారి కుమారుడు షరీఫ్ వెంటనే ఇంటిపైకి ఎక్కి హాహాకారాలు చేశారు. కొంతసేపటికి వరద పెరిగి ఇల్లు కూలడంతో కొట్టుకుపోయారు. వారిలో షరీఫ్ ప్రాణాలతో బయటపడగా, సైదాబీ, యాకూబ్ ఆచూకీ లభించలేదు. పాలేరు మినీ హైడెల్ వద్ద పెద్ద కాలువకు ఒకటో గండి, హట్యాతండా వద్ద రెండో గండి పడ్డాయి. దీంతో హట్యాతండా వాసులు తండాను ఖాళీ చేసి బయటకు వెళ్లారు. కూసుమంచి మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 20కి పైగా గ్రామాల్లోకి వరద నీరు వచ్చింది.

తల్లడిల్లిన భద్రాద్రి కొత్తగూడెం

భారీ వర్షం ధాటికి భద్రాద్రి జిల్లా కూడా అతలాకుతలమైంది. లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లరేసరికి మణుగూరు పట్టణం చుట్టూ వరదనీరు చుట్టుముట్టింది. అశ్వాపురం మండలంలోని వాగులో పడి గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. అదే మండలంలో 200 మేకలు, 30 ఎద్దులు మృతిచెందాయి. బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్‌లో 30 ఆవులు మృత్యువాతపడ్డాయి. సింగరేణికి భారీ నష్టం వాటిల్లింది. 40 వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం కలిగింది. వరద ఉధృతికి సీతారామ కాలువ కొట్టుకుపోయింది. మణుగూరు సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన నందికొల్ల రాముమంచం మీదనే మృతిచెందాడు. అశ్వాపురం మండలంలో చింతకుంట చెరువు తెగిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. టేకులపల్లిలో గుండాలకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. వాగు పక్కనే ఓ రైతు కట్టేసిన ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. ములకలపల్లి మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రారంభించిన సీతారామ పంపుహౌస్ కాలువకు గండి పడింది. సుమారు 20 వేల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. పాల్వంచ మండలంలోని బండ్రిగొండ వద్ద కూడా సీతారామ కాలువకు గండి పడింది. ఇక్కడ కూడా సుమారు 30 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

ఖమ్మం నగరంలో మున్నేరు వాగు ఉధృతిలో నీట మునిగిన గంగమ్మ గుడి

ముగ్గురు మంత్రులుండి ఏం లాభం?

- వరదలపై అవగాహనలేమి
- ఖమ్మం జిల్లా అతలాకుతలం
- మధ్యాహ్నం వరకు హైదరాబాద్‌లోనే పొంగులేటి
- డిప్యూటీ సీఎం వెళ్లినా రక్షణ చర్యలు శూన్యం
- మంత్రి తుమ్మలను ఘెరావ్ చేసిన బాధితులు
- రక్షించేవారెవరంటూ ఆర్తనాదాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా వరదల నుంచి కాపాడేందుకు ఎందుకూ పనికిరారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులను ఇచ్చామని నాడు సీఎం రేవంత్ రెడ్డి చెప్పినా.. వాళ్లు మాత్రం మున్నేరు వరదల నుంచి దేవుడే ప్రజలను కాపాడాలని చేతులు ఎత్తివేశారని మండిపడుతున్నారు. తమను ఎవరు కాపాడుతారో తెలియక, రక్షించేవారికోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, బిల్డింగులపైకి ఎక్కి ఆర్తనాదాలు చేస్తున్నారు. తిండిలేక హాహాకారాలు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఉమ్మడి ఖమ్మం జిల్లా అటు గోదావరి, ఇటు మున్నేరు నదుల వరదల్లో చిక్కుకున్నట్టు వార్తలు వచ్చినా ముగ్గురు మంత్రులకు చీమకుట్టినట్టు కూడా లేదని జనాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. డిప్యూటీ సీఎం పర్యటన వర్షాల కారణంగా శనివారం సాయంత్రమే రద్దు కాగా.. ఆయన ఖమ్మంలోనే ఉన్నా ప్రజలను అప్రమత్తం చేయడంలో, యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడంలో పూర్తిగా విఫలమయ్యారు. పేరుకు రెండు, మూడు ప్రాంతాలకు వెళ్లినా ఖమ్మం నగరాన్ని మాత్రం విస్మరించారు.

అవగాహన లేదు.. అంచనా లేదు

రాష్ట్రంలో ఎప్పుడు భారీ వర్షాలు వచ్చినా, ఖమ్మంలో అతి భారీ వర్షం కురిసినా ముందుగా ప్రభావితమయ్యేది మున్నేరు పరివాహక ప్రాంతమే. అటు ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్, ఇటు హైదరాబాద్‌వైపు వెళ్లే గ్రామాలు వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటాయి. గత పదేండ్లలో ఖమ్మంలో ఎప్పుడు భారీ వర్షం వచ్చినా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రజలు, అధికారులను అప్రమత్తం చేసేవారు. లోతట్టు ప్రాంతాలవారిని పోలీసుల సహకారంతో సురక్షిత ప్రాంతాలకు తరలించేవారు. ముందుస్తు చర్యలు పకడ్బందీగా తీసుకునేవారు. ఇప్పుడు ముగ్గురు మంత్రులున్నా అరకొరగానే ముందస్తు ఏర్పాట్లు చేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణశాఖ, హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారం నుంచి హెచ్చరిస్తున్నా వరదలపై అవగాహన లేక, ముందస్తు అంచనా లేక జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోనే గడిపారు. తీరా ఇప్పుడు దేవుడిపైనే భారం వేశారు. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో పొంగులేటి ఖమ్మం చేరుకొని, కొన్ని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

సహాయక చర్యల్లో వేగం పెంచండి

- ఖమ్మం, మహబూబాబాద్‌లో ఐదుగురి మృతి విషాదం
- నిరాశ్రయులకు షెల్టర్లు ఏర్పాటుచేయాలి
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : భారీ వానలు, వరదలతో అతలాకుతలమైన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రడి మాండ్ చేశారు. భారీ వ రదల కారణంగా మున్నే రు నది పోటెత్తడంతో ఐదుగురు మృత్యువాత పడడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఖమ్మంలో వందలాది ఇండ్లు ముంపునకు గురై, వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. నిరాశ్రయులకు షెల్టర్లు ఏర్పాటుచేయాలని, తాగునీరు, ఆహారం అందించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు.

సీఎం డౌన్ డౌన్.. తుమ్మల గోబ్యాక్

మొదటిపేజీ తరువాయి...

బాధితులు పెద్దసంఖ్యంలో రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఉన్నా పనికిరారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండ్రోజుల నుంచి భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చి ఇండ్లు కొట్టుకపోతున్నా ఏ ఒక్క మంత్రి కూడా ఇక్కడికి రాలేదని, వారు వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ డౌన్‌డౌన్.. ఎమ్మార్వో డౌన్‌డౌన్.. అంటూ నినాదాలు చేశారు. ఆందోళనకారులను సముదాయించడానికి ప్రయత్నం చేసిన పోలీసులపైనా ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది ఇదేవిధంగా వరదలు వచ్చి ఇబ్బందుల్లో ఉంటే పువ్వాడ అజయ్ గిర్రుగిర్రున తిరుగుతూ వరద నీటిలోనే ప్రజలను ఆదుకున్నారని పలువురు మహిళలు గుర్తుచేసుకున్నారు. అలాంటోడిని వదిలి ఈ కాంగ్రెస్సోడికి ఓటేస్తే ఎవడూ రాలేదేం? అని ధ్వజమెత్తారు.

'తుమ్మల గోబ్యాక్' అంటూ నినాదాలు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం రాత్రి వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్‌కు వెళ్లగా.. అక్కడ ఉన్న బాధితులు తుమ్మలను చూసి ఇప్పుడా వచ్చేది తుమ్మల గారు, గోబ్యాక్ మంత్రి తుమ్మల అంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. వరదల్లో చిక్కుకొని ఆర్తనాదాలు చేస్తుంటే జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఉండి ఏం చేస్తున్నారు? అని నిలదీశారు. తక్షణమే తమవారిని కాపాడేందుకు హెలికాప్టర్ కావాలని ఘెరావ్ చేశారు. అయితే, హెలికాప్టర్ వచ్చే పరిస్థితులు లేవని చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో తనకున్న పలుకుబడితో ఏపీ సీఎం చంద్రబాబును సాయం కోరినట్టు చెప్పినా ఆదివారం రాత్రి వరకు విశాఖపట్నం నుంచి ఒక్క హెలికాప్టర్ కూడా రాలేదు. ఆఖరుకు కొందరు జర్నలిస్టులు ఇచ్చిన సమాచారంతో మున్నేరులో చిక్కుకున్న బాధితులను కాపాడేందుకు అగ్నిమాపక ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి.

కష్టాల్లో ఆదుకోని మంత్రులు ఎందుకు?

విద్యార్థిని రిషిక

కష్ట సమయంలో ప్రజలను ఆదుకోని మంత్రులు ఎందుకు? జిల్లాలో ముగ్గురున్నా లాభం లేదు. ఖమ్మంలో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రకాశ్‌నగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప ట్టించుకోరా? వరదల్లో చిక్కుకున్న వా రిని రక్షించడంలో వైఫల్యం చెందారు. కేవలం భోజనం పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోతుందా? మంత్రి తుమ్మల ఎందుకు వచ్చిందో చెప్పాలి

- రిషిక, ఇంటర్ విద్యార్థిని, ఖమ్మం

మానుకోట అతలాకుతలం

- రోడ్డు, రైలు మార్గాలన్నీ బంద్
- కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద కొట్టుకుపోయిన రైల్వేట్రాక్
- జలదిగ్బంధంలో రావిరాల గ్రామం
- రాజుకొత్తపల్లి కట్ట తెగి తీవ్ర నష్టం

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల కింద కోతకు గురైన నేల

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: భారీవర్షాలతో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైంది. జనజీవనం స్తంభించింది. జిల్లాలో 29.67 సెంటీమీటర్లు సగటు వర్షపాతం నమోదవగా, అత్యధికంగా చిన్నగూడూరులో 45.06 సెంటీమీటర్లు కురిసింది. రైలు, రోడ్డు మార్గాలన్నీ పూర్తిగా బంద్ అయ్యాయి. చెరువులకు గండ్లు పడి వేలాది ఎకరాల పంట నీట మునిగింది. సుమారు 20 వేల ఎకరాల్లో వరి, 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా. కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద రెండు చోట్ల రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. ఇంటికన్నె వద్ద 417వ మైలురాయి నుంచి 418వ మైలురాయి వరకు, 418వ నుంచి 420వ మైలురాయి వరకు రెండు చోట్ల ట్రాక్ కొట్టుకపోయింది. మహబూబాబాద్, తాళ్ల పూసపల్లి మధ్య మంద కొమురమ్మ నగర్ వద్ద ఉన్న 432వ, 433వ మైలురాయి వరకు ట్రాక్ దెబ్బతిన్నది. పట్టాల మధ్యలో బుంగ పడి కుంగిపోయింది. దీంతో సిబ్బంది సమాచారంతో కొన్ని రైళ్లు డోర్నకల్ జంక్షన్‌లో, మరికొన్ని మహబూబాబాద్, మరో రెండు రైళ్లు కేసముద్రం రైల్వేస్టేషన్లలో నిలిచిపోయాయి. ఆయా చోట్ల రైల్వే ప్రయాణికులు అర్ధరాత్రి వేళ అవస్థలు పడ్డారు. స్థానికులతో పాటు పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు, కుల సంఘాలు ఆహారాన్ని తీసుకొచ్చి ప్రయాణికులకు అందజేశారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. నెల్లికుదురు మండలంలోని రాజుకొత్తపల్లి చెరువుకట్ట తెగి సమీప ప్రాంతాల్లోని ఇండ్లలోకి చేరాయి. సుమారు 36 గొర్రెలు నీటిలో కొట్టుకుపోగా, 19 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. నాలుగు ఇండ్లు నేల మట్టమయ్యాయి.

మహబూబాబాద్ శివారులో వాగు ఉధృతికి మునిగిన వంతెన

జలదిగ్బంధంలో చిక్కుకున్న 9 మంది సేఫ్

ఖమ్మం, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద మున్నేరు వాగులో చిక్కుకున్న 9 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం నుంచి ఆర్తనాదాలు చేసినా రాత్రి 10 గంటల వరకు అధికారులు స్పందించలేదు. వరదలో చిక్కుకున్నా తమను పట్టించుకోవడం లేదని, కనీస సహాయక చర్యలు లేవంటూ బాధిత కుటుంబాలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నిలదీశాయి. ప్రభుత్వంపై నమ్మకం లేక స్థానికులు, బంధువులు గజ ఈతగాళ్లను పంపించారు. రాత్రి 10 గంటలకు వర్షం తగ్గముఖం పట్టడంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో జేసీబీ సాయంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చేరుకోగా అప్పటికే స్థానికుల సహకారంతో వారు బయటపడ్డారని నిర్ధారించి వెనక్కి వచ్చారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఏం ప్రయోజనమని బాధిత కుటుంబాలు ధ్వజమెత్తాయి.

గజ ఈతగాళ్లే రక్షించారు!

ఖమ్మంలో మున్నేరు వరదలో చిక్కుకున్న మరో 11 మంది బాధితులనూ బంధువులే రక్షించుకున్నారు. కరుణగిరి సాయికృష్ణనగర్ వాటర్ ట్యాంకు వద్ద ఓ ఇల్లు రెండో ఫ్లోర్ వరకూ నీరు చేరింది. తమను రక్షించాలని దివ్యాంగుడు సహా ఐదుగురు పెద్దలు, ఐదుగురు పిల్లలు వేడుకుంటూ ఉదయం వారు పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో బంధువులు డబ్బులు చెల్లించి వైరా ప్రాంతం నుంచి ముగ్గురు గజ ఈతగాళ్లను రప్పించి బాధితులను బయటకు తీసుకొచ్చారు.

రాళ్లవాగులో ఒకరి గల్లంతు..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండల శివారు ఈదుల పూసపల్లి రోడ్డులో ఉన్న రాళ్లవాగులో ఆదివారం రాత్రి ఏపీకి చెందిన డీసీఎం వ్యాన్ చిక్కుకుపోయింది. ఐదుగురిలో ముగ్గురు వ్యాన్‌ను, మిగతా ఇద్దరు చెట్టును పట్టుకొని ఉన్నారు. వారిలో ఒకరు గల్లంతు కాగా మిగతా నలుగురిని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడారు.

వరదలో కొట్టుకుపోయిన తండ్రీకూతురు

- కూతురు మృతదేహం లభ్యం
- తండ్రి ఆచూకీ కోసం గాలింపు
- భారీ వర్షాలకు 13 మంది మృతి
- వరదలో మరో 10 మంది గల్లంతు

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం 13 మంది మృతి చెందారు. మరో 10 మంది గల్లంతయ్యారు. వందల సంఖ్యలో మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రి, కూతురు నూనావత్ మోతీలాల్ (45), నూనావత్ అశ్వని (26) వాగు వరదనీటిలో గల్లంతయ్యారు. అశ్వని ఛత్తీస్‌గఢ్‌లోని రాయగఢ్ వ్యవసాయ యూనివర్సిటీలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నది. ఆమె సోదరుడికి నిశ్చితార్థానికి వచ్చి ఆదివారం తెల్లవారుజామున తండ్రి మోతీలాల్‌తో కలిసి హెదరాబాద్ విమానాశ్రయానికి కారులో బయలుదేరింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద బ్రిడ్జీ పైనుంచి పారుతున్న ఆకేరు వాగులోనే కారును పోనిచ్చారు. వరద ఉధృతికి కారు కొట్టుకుపోయింది. తమను రక్షించాలని కుటుంబ సభ్యులకు తండ్రి, కూతురు ఫోన్ చేశారు. కొద్దిసేపటికి వారి ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. పోలీసుల సహాయంతో గ్రామస్తులు గాలింపు చేపట్టారు. సమీపంలోని తోటలో అశ్వని మృతదేహం లభించింది. తండ్రి మోతీలాల్ ఆచూకీ కోసం పోలీసులు, రెస్క్యూ బృందాల సభ్యులు గాలిస్తున్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం వెంకటాపురంలోని తోగువాగు ఉప్పొంగడంతో తాటి ఆదెమ్మ (70), కల్లూరి నీలమయ్య (60) కొట్టుకుపోగా 200 మేకలు, 30 పశువులు గల్లంతయ్యాయి. వారి మృతదేహాలు వాగు ఒడ్డున చెట్ల వద్ద దొరికాయి. మేకలు, పశువులు మృతిచెంది చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెంకటాపురంలో నర్సయ్య, హనుమకొండ జిల్లా పరకాల మండలం రాజీపేటలో గువ్వరాములు (58), పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్, కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన గోస్కుల కుమార్ (45), కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన కైరంకొండ శివరాములు (55), సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లికి చెందిన సందరి లక్ష్మణ్ (55) గల్లంతయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలో జెర్రిపోతుల మల్లికార్జున్ (38), వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావిలో వృద్ధురాలు కొంద్రు సమ్మక్క, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆరీఫ్ మన్సూర్ (14 నెలలు), నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లోతల్లి హన్మమ్మ(60), కూతురు అంజమ్మ (40), సిద్దిపేట జిల్లా కోహెడ మండల రాంచంద్రాపూర్‌లో బొబ్బల కనకారెడ్డి (60) మృతిచెందారు. కాగా.. ఉమ్మడి జిల్లాల పరిధిలో 61 పశువులు, నాలుగు బర్రెలు, 1500 కోళ్లు, 422 గొర్రెలు వరద నీటిలో చిక్కుకొని మృత్యువాత పడగా.. మరో 156 గొర్రెలు వర్షపునీటిలో కొట్టుకుపోయాయి.